www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 10-6-2024
Ananthapuramu | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | అనంతపురము సిటీ**

పెన్నహోబిల నారసింహుడిని దర్శించుకున్న కలెక్టర్

ఉరవకొండ, జూన్ 9: పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి వారిని కలెక్టర్ వినోద్‌కుమార్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు మేళతాళాలతో స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో కలెక్టర్ పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరిత్రను వివరించారు. తీర్థ ప్రసాదాలను అందజేసి సత్కరించారు.



కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

ఓటర్ల యూటర్న్

- గత ఎన్నికల్లో వైసీపీకి 1.88 లక్షల ఓట్లు
- ఈ ఎన్నికల్లో అంతకు మించి.. కూటమికి..
- వైసీపీ పాలనపై తీవ్ర వ్యతిరేకతే కారణం

జిల్లాలో టీడీపీకి 1.90 లక్షల ఓట్ల ఆధిక్యం



2019 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని ఉరవకొండ మినహా మిగిలిన ఏడు నియోజకవర్గాల్లో వైసీపీ విజయం సాధించింది. టీడీపీ కంటే 1.88 లక్షలకుపైగా ఓట్ల ఆధిక్యతను కనబరించింది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో అదే ఓటర్లు యూటర్న్ తీసుకున్నారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లోనూ టీడీపీ అభ్యర్థులకే పట్టం కట్టారు. 1.90 లక్షలకుపైగా ఓట్ల అధిక్యతను టీడీపీకి ఇచ్చారు. దీన్నిబట్టి చూస్తే ఐదేళ్ల వైసీపీ పాలనపై ప్రజలు ఎంతగా విసిగిపోయారో అర్థం అవుతుంది. బటన్ నొక్కుడుతో అరకొరగా సంక్షేమ పథకాలు అమలు చేయడం మినహా జిల్లాలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నది నిర్వివాదాంశం. ఇచ్చిన హామీలను కూడా వైసీపీ అమలు చేయలేదనడంలో ఎలాంటి సందేహం లేదు. పెండింగ్ ప్రాజెక్టుల గురించి అస్సలు పట్టించుకోలేదు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పన ఊసే మరిచిపోయారు. ఏ ఒక్క పరిశ్రమను జిల్లాకు తీసుకురాలేదు. ఇలా అనేక హామీలు మాటలకే పరిమితమయ్యాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం

2019, 2024 ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని ఓట్లంటే...

	2019లో			2024		
నియోకవర్గం	వైసీపీ	టీడీపీ	మెజార్టీ	టీడీపీ	వైసీపీ	మెజార్టీ
రాయదుర్గం	1,09,043	94,994	14049	1,30,309	88,650	41,659
ఉరవకొండ	88,077	90,209	2132	1,02,046	80,342	21,704
గుంతకల్లు	1,06,922	58,390	48532	1,01,700	94,874	6,826
తాడిపత్రి	92,911	85,400	7511	1,13,755	86,024	27,731
శింగనమల	1,18,044	71,802	46242	1,02.957	94,169	8,788
అనంతపురం అర్బన్	88,704	60,006	28698	1,03,334	80,311	23,023
కళ్యాణదుర్గం	88,051	68,155	19896	1,18,878	81,144	37,734
రాప్తాడు	1,11,201	85,626	25575	1,16,140	92,811	23,329
మొత్తం	8,02,953	6,14,582	1,88,371	8,89,119	6,98,325	1,90,794

టీడీపీకి 1.90 లక్షలకుపైగా ఓట్ల ఆధిక్యత

జిల్లాలోని రాప్తాడు, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లో మొత్తం 20,18,162 మంది ఓటర్లు ఉన్నారు. అందులో ఈ ఎన్నికల్లో 16,36,448 ఓట్లు పోలయ్యాయి. ఇందులో టీడీపీకి 8,89,119 ఓట్లు వచ్చాయి. అంటే 54.33 శాతం ఓట్లు టీడీపీకి పోలయ్యాయి. 8 నియోజకవర్గాల్లోనూ కూటమి టీడీపీ అభ్యర్థులే విజయం సాధించారు. 1,90,794 ఓట్లు మెజార్టీని సాధించింది. ఇక వైసీపీ విషయానికొస్తే ఈ ఎన్నికల్లో 8 నియోజకవర్గాలకుగానూ వైసీపీకి 6,98,325 ఓట్లు వచ్చాయి. అంటే 42.67 శాతం ఓట్లు వచ్చాయి.

2019లో వైసీపీకి 1.88 లక్షల ఓట్ల ఆధిక్యత...

గత సార్వత్రిక ఎన్నికల్లో 8 నియోజకవర్గాలకుగానూ 7 నియోజకవర్గాలు వైసీపీ వశమయ్యాయి. ఉరవకొండ టీడీపీకి దక్కింది. జిల్లాలో మొత్తం ఓటర్లు 19,08,668 ఉండగా... అందులో 15,21,449 ఓట్లు పోలయ్యాయి. ఇందులో వైసీపీకి 8,02,953 ఓట్లు వచ్చాయి. అంటే 52.77 శాతం ఓట్లు వచ్చాయి. 1,88,371 ఓట్లు మెజార్టీని సాధించింది. ఇక టీడీపీ విషయానికొస్తే... 8 నియోజకవర్గాల్లో 6,14,582 ఓట్లు వచ్చాయి. అంటే టీడీపీకి 40.39 శాతం ఓట్లు వచ్చాయి.



తేడా ఇదీ...

2019 ఎన్నికల్లో జిల్లాలో వైసీపీకి 52.77 శాతం ఓట్లు రాగా... టీడీపీకి 40.39 శాతం ఓట్లు వచ్చాయి. టీడీపీ కంటే వైసీపీకి 12 శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. 2024 ఎన్నికల్లో పరిస్థితి తిరగబడింది. టీడీపీకి 54.33 శాతం ఓట్లు రాగా... వైసీపీకి 42.67 శాతం ఓట్లు వచ్చాయి. 12 శాతం ఓట్లు టీడీపీకి అధికంగా రావడం గమనార్హం.


20 మండలాల్లో వర్షం



అనంతపురం అర్బన్, జూన్ 9: జిల్లాలోని 20 మండలాల్లో శనివారం రాత్రి వర్షం పడింది. అత్యధికంగా గుంతకల్లులో 22.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. యాడికి 18.2, ఉరవకొండ 15.8, పామిడి 15.4, బెళుగుప్ప 14.2, తాడిపత్రి 12.2, గార్లదిన్నె 9.4, గుమ్మఘట్ట 9.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 7.4 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది. పుట్లూరులో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. అనంతపురం, నార్పల తదితర మండలాల్లో జల్లులు పడ్డాయి.







ఎమ్మెల్యే సునీతను కలిసిన టీడీపీ శ్రేణులు



పరిటాల సునీతకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్‌టీయూసీ రాజు, డ్రైవర్స్ సంఘం నాయకులు

అనంతపురంరూరల్, జూన్ 9: రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే పరిటాల సునీతను ఆదివారం పలువురు మండల నాయకులు కలిశారు. సాధారణ ఎన్నికల్లో గెలుపొందిన సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్‌టీయూసీ హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి రాజురాయల్, డ్రైవర్ యూనియన్ సభ్యులు ముక్తార్ భాష, రాప్తాడు సోషల్ మీడియా నాయకుల అశోక్ తదితరులు ఎమ్మెల్యేను కలిశారు. అదేవిధంగా మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పాపంపేటకు చెందిన మాజీ స్టోర్ డీలర్ పేరంహరి, ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజినేయులు ఎమ్మెల్యేను కలిశారు. ముస్లిం మైనార్టీ సెల్ రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షులు అల్లీపీరా, బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, నాయకులు ఓబులేసు, యాలేటి గోపాల్, ఈశ్వర్‌రెడ్డి, ఆదినారాయణ, మంజునాథ్, చిన్నంపల్లికి చెందిన మాజీ సర్పంచు కొండయ్య పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో దగ్గుపాటి విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, జూన్ 9: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన దగ్గుపాటి ప్రసాద్‌కు ఆయన సన్నిహితులు, శ్రేయోభిలాషులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే హోదాలో ఆదివారం తొలిసారిగా హైదరాబాద్‌కు వెళ్లిన దగ్గుపాటి ప్రసాద్‌కు ఆయన సన్నిహితులు, శ్రేయోభిలాషులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా మైత్రి నగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి తన ఇంటి దాకా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. దారిపొడవుగా పూల వర్షం కురిపిస్తూ బాణా సంచాపేలుస్తూ దగ్గుపాటి ప్రసాద్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో అనంత జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు, హైదరాబాద్‌లోని దగ్గుపాటి సన్నిహితులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు



మొక్కుతీర్చుకుని ఆనందాన్ని పంచుకుంటున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, జూన్ 9: పరిటాల సునీత రాప్తాడు ఎమ్మెల్యేగా గెలవడంతో బుక్కచెర్ల టీడీపీ నాయకులు ఆదివారం మొక్కులు తీర్చుకున్నారు. మండల టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో నల్లలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి 1016 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ధర్మవరపు మురళి మాట్లాడుతూ పరిటాల సునీత నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాలను అభివృద్ధి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టీచర్ల సంక్షేమమే ఎస్టీయూ లక్ష్యం

- ఘనంగా ఆవిర్భావ వేడుక



మాట్లాడుతున్న రామాంజనేయులు

అనంతపురం విద్య, జూన్ 9: ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా ఎస్టీయూ ముందుకెళుతోందని ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఎస్టీయూ 78వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు మాట్లాడుతూ నిజాం కాలంలో పురుడుపోసుకున్న ఎస్టీయూ అనేక ఉద్యమాలు చేసిందన్నారు. టీచర్ల న్యాయబద్ధమైన సమస్యలపై అనేక పోరాటాలు చేసిందన్నారు. యూనియన్ వ్యవస్థాపకులు వీణ విజయరామరాజు, మగ్దూం మొహిద్దీన్ సేవలు మరువలేనివన్నారు. ఆ సంఘం రాష్ట్ర నాయకులు సూర్యుడు, చంద్రశేఖర్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం టీచర్లను బోధనకే పరిమితం చేయాలన్నారు. అదేవిధంగా జీవోలు 117, 128 రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రాజశేఖర్, కిశోర్ కుమార్, రామకృష్ణ, నాగేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి జన్మదినం

రామగిరి, జూన్ 9: టీడీపీ మండల ప్రధానకార్యదర్శి మారుతీప్రసాద్ జన్మదినం సందర్భంగా ఆయనకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శితోపాటు టీడీపీ నాయకులువెళ్లి పరిటాల సునీతకు అభినందనలు తెలిపారు. అనంతరం మారుతీప్రసాద్ జన్మదినాన్ని ఎమ్మెల్యే పరిటాలసునీత ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పరిటాలసునీత మాట్లాడుతూ అభివృద్ధి కోసం సమష్టిగా ముందుకుసాగుదామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పరంధామయాదవ్, తెలుగుయువత అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ఆనంద్, జయచంద్రానాయుడు, ర ఘురాములు, పేరూరు నాగభూషణ, కోడిరామ్మూర్తి, విజయ్‌నాయక్ పాల్గొన్నారు.



మండల ప్రధాన కార్యదర్శికి కేక్ తినిపిస్తున్న పరిటాలసునీత

సానుకూల దృక్పథమే సమస్యలకు పరిష్కారం

అసిస్టెంట్ కలెక్టర్ బొల్లినేని వినూత్న

అనంతపురం టౌన్, జూన్ 9: ఏ సమస్య వచ్చినా సానుకూల దృక్పథంతో ముందుకు సాగితే పరిష్కారం దొరుకుతుందని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సూచించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో హీమోఫీలియా బాధితులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసిస్టెంట్ కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులు, కుటుంబసభ్యులు వారు పడుతున్న కష్టాలను ఆమెకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హీమోఫీలియా బాధితుల బాధలు ఆవేదనను కలిగిస్తున్నాయన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున అందిస్తున్న సేవలు సులభంగా, త్వరితగతిన అందించేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు. కొన్ని కఠినమైన సమస్యలు వస్తుంటాయని వాటికి భయపడడం కన్నా ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగితే ఏదో ఒకరోజు మంచి ఫలితం లభిస్తుందన్నారు. జిల్లా ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ విభాగంలో హీమోఫీలియా బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఇంటాస్ ఫౌండేషన్ ప్రతినిధులు వాసుదేవరావు, రామకృష్ణ, శ్యాంసుందర్, కృష్ణమూర్తితోపాటు పలువురు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న అసిస్టెంట్ కలెక్టర్

నొళంబుల చరిత్ర రికార్డు సాహసోపేతం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి

అనంతపురం కల్చరల్, జూన్ 9: నొళంబుల చరిత్రను రికార్డు చేయడమనేది సిద్ధగిరి శ్రీనివాసులు చేసిన ఒక సాహసోపేతమైన ప్రయత్నమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి పేర్కొన్నారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన "నొళంబవాడి" పుస్తక పరిచయ సభకు బండి నారాయణస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మడకశిర ప్రాంతానికి చెందిన రచయిత సిద్ధగిరి శ్రీనివాసులు తన స్థానిక చరిత్రను రికార్డు చేయాలన్న తలంపులోంచి ఈ గొప్ప చరిత్రను తీసుకువచ్చారని, ఇది చరిత్రకు కొత్త చేర్పు అయిందని కొనియాడారు. అనంతరం జిరసం అధ్యక్షుడు డాక్టర్ జెన్నె ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ చరిత్ర అధ్యయనం నానాటికీ కుంటుపడుతోందని, ప్రతిఒక్కరూ చరిత్ర అధ్యయనంపై దృష్టి సారించాలన్నారు. సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా మాట్లాడుతూ సిద్ధగిరి శ్రీనివాసులు సునిసితమైన పరిశీలన జ్ఞానం ఈ పుస్తక రూపకల్పనకు దారితీసిందన్నారు. ఇలాంటి మరెన్నో పుస్తకాల రూపకల్పనకు ఆయన శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫర్ ద సొసైటీ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల రాధాకృష్ణ, అనంత విద్యావంతుల వేదిక అధ్యక్షుడు బండి నాగరాజు, లలితకళాపరిషత్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జిరసం గౌరవ సలహాదారు కంబదూరి షేక్ నబీరసూల్, మధురశ్రీ, కొత్తపల్లి సురేష్, కోటిగారి వన్నప్ప, తరిమెల అమర్నాథరెడ్డి, గోవిందరాజులు, జూటూరు షరీఫ్, షేక్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహిత్యకారులు

అక్షరాలను సరిచేశారు

టీడీపీ ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో అధికారుల చర్యలు

అనంతపురం సెంట్రల్, జూన్ 9: ప్రజల సొమ్మును జీతాలు తీసుకునే అధికారులు రాజకీయ పార్టీలకు వంతపాడారు. ముఖ్యంగా జేఎన్‌టీయూ పరిపాలన అధికారులు ఐదేళ్లు వైసీపీకి అంటకాగారు. పారదర్శకంగా పనిచేయాల్సిన వారు ఇలా అంటకాగటంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పలు దఫాలుగా ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూవచ్చారు. అయినా వారిలో మార్పురాలేదు. జేఎన్‌టీయూలో అధునాత సౌకర్యాలతో నిర్మించిన ఆడిటోరియానికి 'నందమూరి తారక రామారావు కళాక్షేత్రం' అని పేరు పెట్టుకుని గౌరవించుకున్నారు. ఆయనకూ రాజకీయరంగు పులిమిన అధికారులు ఆడిటోరియానికి సిల్వర్ మెటల్‌తో రాసిన అక్షరాలు ఊడిపోయినా, విగ్రహం రంగులుపోయి పెచ్చులూడినా పట్టించుకోలేదు. జనవరిలో నిర్వహించిన స్నాతకోత్సవం, న్యాక్ బృంద పర్యటనను పురస్కరించుకుని ఆడిటోరియానికి రంగులువేసి హంగులు తీర్చిదిద్దినా ఎన్టీఆర్ పేరును, విగ్రహాన్ని విస్మరించారు. ఈ అంశాన్ని జనవరి 6న 'ఆంధ్రజ్యోతి'లో 'సారీ.. అన్న గారూ..!' శీర్షికన ప్రచురించడం జరిగింది. తాజాగా టీడీపీ ప్రభుత్వం కొలువు దీరనున్న నేపథ్యంలో కొత్త అక్షరాలతో ఎన్టీఆర్ ఆడిటోరియం పేరును సరిచేశారు. అధికారుల తీరుపై విద్యార్థులు విస్మయాన్ని వ్యక్తంచేస్తున్నారు. ఐదేళ్లుగా విస్మరించిన పరిపాలనాధికారులు ప్రభుత్వం మారగానే ఇలా మారిపోయారంటే ఏ ఎండకు ఆ గొడుగు పట్టడమంటే ఇదేనేమోనని చర్చించుకుంటున్నారు.



ఎన్టీఆర్ ఆడిటోరియానికి కొత్త అక్షరాలు

పవన్‌కల్యాణ్ విజయం చారిత్రాత్మకం

జనసేన, బలిజ సంఘం నాయకులు



మాట్లాడుతున్న బలిజ సంఘం, జనసేన నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 9: తాజాగా జరిగిన ఎన్నికల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విజయం చారిత్రాత్మకమని జనసేన, బలిజ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం బలిజ సంఘం కార్యాలయంలో ఆ సంఘం సీనియర్ నాయకులు పేరూరు శ్రీనివాసులు, జనసేన జిల్లా కార్యదర్శి కాశెట్టి సంజీవరాయుడు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బలిజలు శక్తివంచన లేకుండా కూటమి అభ్యర్థులను గెలుపునకు కృషి చేశారన్నారు. పిఠాపురం ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిచిన పవన్‌కల్యాణ్‌కు వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్నెల కృష్ణ, గ్రంధి దివాకర్, తోట ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత జీవితం

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, జూన్ 9: ఉన్నత విద్యతోనే ఉన్నత జీవితాన్ని పొందవచ్చునని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి విద్యార్థులకు సూచించారు. ఆదివారం తపోవనంలోని మార్కండేయ దేవస్థానంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకకు జిల్లా ఉపవిద్యాశాఖాధికారి శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్‌తోపాటు ప్రిన్సిపాల్ రామమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైతరగతులకు వెళ్లేందుకు మార్కులు ప్రధానం కాదని వ్యక్తిత్వ వికాశాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా లక్ష్యసాధనపై గురిపెట్టాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. పద్మశాలి సంక్షేమసంఘం అధ్యక్షులు రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు శివరుద్రప్ప, యుగంధర్, లక్ష్మీనరసింహ, సుజాత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి

పరిటాల సునీతను కలిసిన టీఎన్‌యూఎస్ నేతలు



సునీతను కలసిన నాయకులు

అనంతపురం విద్య, జూన్ 9: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను ఆదివారం కలిశారు. ఆ సంఘం నాయకులు రామలింగప్ప, రమణప్రసాద్, వెంకటరాముడు, బాబు, ఈశ్వరయ్య, ఆంజినేయులు, శ్రీనివాసులు, రామాంజినేయులు, నాగరాజు, మనోహర్ తదితరులు పరిటాల సునీతను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత తాగునీటి ప్లాంట్ ఏర్పాటుకు స్థల సేకరణ



స్థల సేకరణ చేస్తున్న మండల కన్వీనర్, ఇతరనాయకులు

అనంతపురంరూరల్, జూన్ 9: మండలంలోని సిండికేట్ నగర్‌లో ఉచిత తాగునీటి ప్లాంట్ ఏర్పాటుకు టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ స్థల సేకరణ చేపట్టారు. తన సొంత నిధులు రూ.9లక్షలు వెచ్చి గ్రామంలో స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ క్రమంలోనే ఆదివారం ఆ స్థలాన్ని మండల కన్వీనర్‌తోపాటు టీడీపీ నాయకులు పరిశీలించారు. త్వరలోనే పనులు ప్రారంభించి స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతపేరు మీదుగా ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామస్థులకు ఉచితంగా మంచినీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంఈఓ కుమారుడికి 204వ ర్యాంకు



తల్లిదండ్రులతో సాయి గౌతమ్

అనంతపురం విద్య, జూన్ 9: జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ఎంఈఓ కుమారుడికి 204వ ర్యాంకు వచ్చింది. శింగనమల ఎంఈఓ శివప్రసాద్, గుత్తిమండలం బేతపల్లి జడ్పీహైస్కూల్‌లో గణితం స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నిరుపమ కుమారుడు సాయి గౌతమ్ జేఈఈ పరీక్షల ఫలితాల్లో 281 మార్కులు సాధించాడు. ఆలిండియా స్థాయిలో 204వ ర్యాంకు సాధించాడు. దీంతో సాయి గౌతమ్ తల్లిదండ్రులు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

మరో విద్యార్థికి 3509 ర్యాంకు: నగరానికి చెందిన మరో విద్యార్థి శ్రవణ్ రామ్‌కు జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించారు. పరీక్షల్లో 186 మార్కులు సాధించిన శ్రవణ్ రామ్ జనరల్ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 359వ ర్యాంకు, ఓపెన్ క్యాటగిరీలో 3509 ర్యాంకు దక్కించుకున్నాడు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

రామోజీరావు సేవలు మరువలేనివి

- ఏపీయూడబ్ల్యూజే నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 9: రామోజీరావు సేవలు మరువలేనివని ఏపీయూడబ్ల్యూజే నాయకులు అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్ అయూఫ్ ఆధ్వర్యంలో రామోజీరావు సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువలతో కూడిన జర్నలిజాన్ని సమాజానికి అందించిన గొప్ప వ్యక్తి రామోజీరావన్నారు. సంతాప సభలో యూనియన్ సహాయ కార్యదర్శి చలపతి, చౌడప్ప, కేపీ కుమార్, సనప రామకృష్ణ, పట్టుపోగుల రామాంజనేయులు, ఐజేయూ సభ్యులు ప్రభాకర్ నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జయరాం, సీనియర్ జర్నలిస్టులు మార్కండేయులు, జర్నలిస్టు నాగభూషణం, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రసూల్, మహేష్, అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం ప్రెస్‌క్లబ్: రామోజీరావుకు మాజీ సైనికులు శనివారం సంక్షేమ సంఘ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేకన్న, వీకే రంగారెడ్డి, పట్నం ఉమామహేశ్వరరావు, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: రామోజీరావు మృతికి మండల విలేకరులు నివాళులర్పించారు. చెన్నేకొత్తపల్లిలోని ఎమ్మార్పీ కార్యాలయంలో శ్రీనివాసులు, దేవేంద్రరెడ్డి, రామకృష్ణ, ప్రవీణ్, మహానందరెడ్డి, గణేశ్ తదితరులు నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు



ప్రత్యేక అలంకరణలో రేణుకా యల్లమ్మ

ఘనంగా రేణుకా యల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్, జూన్ 9: జీసెస్ నగర్‌లోని రేణుకా యల్లమ్మ దేవాలయం 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులుగా నిర్వహిస్తున్న వేడుకలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో రేణుకా యల్లమ్మ మూలవిరాట్‌కు ఫలపంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాది కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు పెద్దఎత్తున అన్నసంతర్పణ చేశారు. రాత్రికి విశేషంగా అలంకరించిన రథంలో అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి నగర వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపు ముందు మహిళలు జ్యోతులతో ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న స్వామిదాస్

అనంతపురం అర్బన్, జూన్ 9: చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో టీడీపీ క్రిష్టియన్ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం చేశారు. టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్, దినకర్, సుధీర్ పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న పల్లవి

అనంతపురం అర్బన్, జూన్ 9: నగరంలోని పాతూరుకు చెందిన టీడీపీ కార్యకర్త మంజు తల్లి వైద్య ఖర్చుల కోసం మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి రూ.5వేలు ఆర్థికం సాయం చేశారు. టీడీపీ కార్యకర్త మంజు తల్లి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆమె ఆదివారం ఆమె చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం చేశారు.

రూ.5లక్షలు దాటిన పశువుల సంత ఆదాయం

అనంతపురంరూరల్, జూన్ 9: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లోని పశువుల సంత ఆదాయం ఈవారం రూ.5లక్షలు దాటింది. ప్రతివారం రూ.3.70లక్షల నుంచి రూ.4.30లక్షల మధ్య ఆదాయం వచ్చేది. ఈవారం మాత్రం మార్కెట్‌కు రూ.5,18,350 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. పశువుల సంత శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,36,050, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.2,82,300 వచ్చిందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతపురంరూరల్, జూన్ 9: విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-1డిఈఈ నాగేంద్ర తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11.30గంటల వరకు ఓబుళదేవరనగర్, విద్యుత్ నగర్, ఆదర్శనగర్, అరవిందనగర్, నాయక్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దరఖాస్తు చేసుకోండి

రాప్తాడు, జూన్ 9: పంగల్ రోడ్డు సమీపంలోని రాప్తాడు ఆదర్శ పాఠశాలలో 7,8,9వ తరగతులు, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజాదేవి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి విద్యార్థులు రిజిష్టర్ చేసుకోవాలన్నారు. రిజిష్టర్ చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి మిగిలిన సీట్లు భర్తీ చేస్తామన్నారు. 7వ తరగతిలో 48, 8లో 35, 9లో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


గుండె పోటుతో మృతి

రాప్తాడు, జూన్ 9: పంచాయతీలోని 8వ వార్డు సభ్యుడు దండు శ్రీనివాసులు గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, కన్వీనర్ పంపు కొండప్ప, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు ఇతర నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు..

నార్పల, జూన్ 9: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం ట్రాక్టర్ బోల్తా పడి రంగారెడ్డి(48) మృతి చెందగా ఒకరు గాయపడ్డారు. నార్పలకు చెందిన కుళ్లాయప్ప ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేసుకొని నార్పల క్రాసింగ్‌కు వెళ్తుండగా బాలుర ఉన్నత పాఠశాల వద్ద బోల్తా పడింది. రోడ్డు పక్కన కూర్చున్న రంగారెడ్డి, ధనుంజయలపై ట్రాక్టర్ పడటంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రంగారెడ్డి మృతి చెందాడు. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా సాగు



● ఈ ఏడాది జిల్లాకు ముందుగానే నైరుతి రుతుపవనాలు ● రైతుల్లో హర్షం ● వేరుశనగ విత్తన సాగులో బిజీ.. బిజీ..



ఎద్దులతో వేరుశనగ విత్తనం వేస్తున్న రైతు



ట్రాక్టరుతో వేరుశనగ వేస్తున్న రైతు



వేరుశనగ విత్తన శుద్ధి చేస్తున్న మహిళ

గుత్తి రూరల్, జూన్ 9: జిల్లాకు ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు నాలుగు రోజులు ముందే రావడంతో సాగుపనులు జోరందుకున్నాయి. రైతులు వేరుశనగ, పత్తి విత్తన సాగుల్లో బీజీబీజీగా ఉన్నారు. ఏడాదిగా వరుణుడి రాక కోసం ఎదురు చూస్తున్న అన్నదాత ఆశలు ఖరీఫ్‌లో ఫలించాయి. గత ఏడాది కరువుతో విలవిలలాడిన అన్నదాత ఆవేదన ఈ సారి తీరేలా ఉందని ఆశతో విత్తనాలు జోరుగా వేస్తున్నారు. మండల వ్యాప్తంగా వారం రోజులుగా వర్షాలు కురుస్తుండంతో రైతులు వేరుశనగ, పత్తి, కంది, ఆముదం విత్తనాలు వేస్తున్నారు. మండలంలోని గొందిపల్లి, గాజులపల్లి, జక్కలచెరువు, కొత్తపేట, ఊబిచెర్ల, బేతాపల్లి యంగన్నపల్లి, కొత్తపల్లి, తొండపాడు, తదితర గ్రామాల్లో పొలాల విత్తే పనుల్లో నిమగ్నమయ్యారు. చేతిలో డబ్బు లేకపోయినా అప్పులు చేసి మరీ రైతు సాగుపనులకు సిద్ధమవుతున్నారు. మృగశిర కార్తెలో వర్షాలు కురవడం ఆనందకరమని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్తెలో పంట సాగు చేస్తే పంటలు చేతికంది రైతుల ఇంట సిరులు కురుస్తాయని రైతుల నమ్మకం. మండల వ్యాప్తంగా 18 వేల హెక్టార్లలో సాగుకు సిద్ధంగా ఉన్నారు. మండల వ్యాప్తంగా 4 వేల హెక్టార్లలో వేరుశనగ, పంటను సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా పత్తి వేయి ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సాగు పనులు మొదలవ్వడంతో ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది. ఎకరాకు ట్రాక్టర్‌కు రూ.1100 నుం రూ.1200లు ఖర్చు చేసి వేరుశనగ విత్తనం వేస్తున్నారు. ఎద్దులతో ఎకరాకు రూ.1000 బాడుగ చెల్లిస్తున్నారు. ఈ ఏడాది వరుణదేవుడిపై భారం ఉంచి పెట్టుబడులు పెడుతున్నామని ఈసారైన కరుణిస్తే అప్పుల నుంచి బయట పడతామని రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మే, జూన్ మాసాల్లో వర్షాలు బాగా కురవడంతో సేద్యాలు చేసి విత్తనానికి సిద్ధం చేసుకున్నామని రైతులు తెలిపారు.



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

మృగశిర కార్తెలో వేరుశనగ సాగు : కిష్టయ్య, రైతు, గొందిపల్లి



మూడు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. మృగశిర కార్తెలోనే విత్తనం వేస్తున్నా. ఈ కార్తెలో వేస్తే పైరు బలంగా వచ్చి మేలైన దిగుబడులు వస్తాయన్న నమ్మకంతో మొదలు పెట్టాను. ప్రస్తుతానికి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాదైనా పంట పండకపోతుందా అని ఆశతో ఉన్నాం.

దేవుని మీద భారం వేసి సాగు చేస్తున్నా: సుధాకర, కొత్తపేట



దేవుడి మీద భారం వేసి మంచి అదునులో వేరుశనగ సాగు చేస్తున్నాను. మృగశిర కార్తెలో వర్షం బాగా రావడంతో మంటపై ఆశ నెలకొంది. ఏటా జూన్ మాసంలో సాగు చేస్తున్నాను. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి వేరుశనగ మంచి దిగుబడి వస్తుందని పంట సాగు చేస్తున్నాను. లాభాలు మిగలాలని కోరుకుంటున్నా.



కడదరకుంట వద్ద వర్షానికి కుళ్లిపోయిన వేరుశనగ కట్టె

ఎడతెరిపి లేని వాన... కుళ్లుతున్న పంటలు

కూడేరు, జూన్ 9: ఎడతెరిపి లేని వర్షాలతో వేరుశనగ పంట కుళ్లిపోతోంది. మండలంలోని కడదరకుంట గ్రామానికి చెందిన రైతు వడ్డే అనిల్ తన ఏడెకరాల పొలంలో నాలుగు ఎకరాల్లో రబీలో వేరుశనగ సాగు చేశాడు. లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే చేతికొచ్చిన పంట వర్షానికి పూర్తిగా దెబ్బతింది. కుళ్లిపోయిన వేరుశనగపంటను చూసి రైతు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. మరోరైతు నారాయణస్వామి సాగుచేసిన పంట కోత దశకు రావడంతో పంటను తొలగించాడు. పంట తొలగించినప్పటి నుంచి వర్షం కురుస్తుండటంతో పొలంలోనే వేరుశనగ కట్టె కుళ్లిపోయింది. రూ.లక్షలు అప్పులు చేసి పంటలు సాగుచేస్తే వర్షాలతో తడిసిపోయామని, ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.



కుళ్లిన కట్టెను చూపుతున్న రైతు అనిల్

పత్తి కూడా..

బొమ్మనహాళ్ : మండలంలో రోజూ కురుస్తున్న వర్షాలతో పత్తి, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలు దెబ్బతిని రైతులకు నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఉద్దేహాళ్, రంగాపురం క్యాంప్, కొళగానహళ్లి, గౌనూరు, కళ్లదేవనహళ్లి తదితర గ్రామాల్లో పంటలు సాగుచేశారు. కొద్దిరోజులుగా వర్షం పడుతున్న నేపథ్యంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతూ పొలాలలో నీరు నిలిచి పత్తి మొక్కలు కుళ్లిపోతున్నాయి. పంటలు చేతికొచ్చే వేళ కుళ్లిపోతుండంతో అన్నదాతకు ఆవేదనే మిగిలింది.



కుళ్లిపోతున్న మొక్కలను చూపుత్ను రైతు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అనంత విద్యార్థుల ప్రతిభ



సతీష్‌రెడ్డిని అభినందిస్తున్న కుటుంబ సభ్యులు



అభినందిస్తున్న నారాయణ కోర్ డీన్ బద్రీనాథ్

అనంతపురం విద్య, జూన్ 9: ఇండియాలోని ప్రముఖ ఐఐటీలు, ఎన్ఐటీ సంస్థల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో అనంతపురం జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మెరుగైన ర్యాంకులు సాధించారు. విద్యార్థుల కుటుంబాల్లో, కళాశాలల్లో సంబరాలు జరుపుకున్నారు.

రైతు బిడ్డకు మెరుగైన ర్యాంకు

సామాన్య రైతు కుమారుడు సత్తా చాటాడు. విద్యార్థి పాలగిరి సతీష్‌రెడ్డి ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 175వ ర్యాంకు సాధించాడు. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లికి చెందిన లక్ష్మీరెడ్డి కుమారుడు సతీష్‌రెడ్డి జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో 285 మార్కులు సాధించాడు. ఓపెన్ కేటగిరీలో 175వ ర్యాంకు సాధించడంతో...విద్యార్థి కుటుంబికులు హర్షం వ్యక్తం చేశారు. సతీష్‌రెడ్డికి స్వీట్లు తినిపించి ఆనందం పంచుకున్నారు.

నారాయణలో...

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థి శశికిరణ్ 360 మార్కులకు గాను 234 మార్కులు సాధించడంతో విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల కోర్ డీన్ బద్రీనాథ్, డీన్ శ్రీనివాసరెడ్డి, డీజీఎం వెంకటరామిరెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఏ కాలేజీలోని విద్యార్థులకు శశికిరణ్‌కు వచ్చిన ర్యాంకు రాలేదన్నారు. శశికిరణ్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 982వ ర్యాంకు సాధించాడన్నారు. మేఘన 4,124వ ర్యాంకు, మోహన్ ప్రదీప్ 4,657వ ర్యాంకు, అజయ్ కృష్ణారెడ్డి 5,287 ర్యాంకు, సిద్ధార్థరెడ్డి 16,145వ ర్యాంకు, అనిమ్‌ఖాన్ 17,929 ర్యాంకు ఆలిండియా స్థాయిలో సాధించారన్నారు. దీపిక 2,241, స్తుతి ప్రశంసిని 3713, రేణుక 4,658 ప్రిపరేటరీ ర్యాంకులు సాధించి క్వాలిఫై అయినట్లు తెలిపారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులకు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రవిశంకర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, హిమబిందు, శిఖామణి, లక్ష్మన్న, జయలక్ష్మి,బాలన్న తదితరులు పాల్గొన్నారు.



నారాయణ విద్యార్థులు మేఘన, మోహన్ ప్రసాద్, సిద్ధార్థరెడ్డి

2059వ ర్యాంక్

తాడిపత్రిటౌన్ : జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో తాడిపత్రి పట్టణంలో నివాసం ఉంటున్న శ్రీనివాసులురెడ్డి, రాజేశ్వరి దంపతుల కుమారుడు చక్రధర్‌రెడ్డి 2059 ర్యాంకు సాధించడంతో కుటుంబంలో ఆనందం నెలకొంది.



చక్రధర్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే సేవలో పోలీసులు

● కొడిమి జగనన్న లేఅవుట్‌లో మిషనరీ, ఇతరత్ర సామగ్రి తరలింపు
● అడ్డుకున్న నరసనాయునికుంట, కొడిమి గ్రామాల టీడీపీ శ్రేణులు
● పోలీసులు రక్షణగా ఉండటంపై ఆగ్రహం



సీఐ, పోలీసులతో టీడీపీ శ్రేణుల వాగ్వాదం

అనంతపురం రూరల్, జూన్ 9: కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న సమయంలో కూడా పోలీసులు పాత ఎమ్మెల్యే సేవలో తరిస్తున్నారని టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు. మండలంలోని కొడిమి జగనన్న లేఅవుట్‌లో ఆదివారం రాక్రీట్ కంపెనీ సభ్యులు మిషనరీ, సెంట్రింగ్ సామగ్రి తరలిస్తుండగా నరసనాయుని కుంట, కొడిమి గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు ఇళ్ల నిర్మాణలు పూర్తి కాలేదు. ఇంకా 44ఎకరాలకు సంబంధించి రైతులకు పరిహారం ఇవాల్సి ఉంది. ఇవేవి కూడా పూర్తిస్థాయిలో తేలకుండా సామగ్రి ఎలా తీసుకెళతారని కంపెనీ ప్రతినిధులను, ఈ దురాగతానికి అండగా ఎలా ఉంటారని పోలీసులను ప్రశ్నించారు. ఐదేళ్లుగా రైతులను బెదిరించి నిర్మాణాలు చేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తి కాకుండానే బిల్లుల సొమ్మును తీసేసుకున్నారని పేర్కొన్నారు. అధికారం మారగానే కంపెనీ సభ్యులు జారుకోవాలని చూడటం ఎంత వరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వారికి వత్తాసుగా ఉదయం నుంచి ఉండటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. సామగ్రి తరలింపుపై పోలీసులను ప్రశ్నిస్తే..హౌసింగ్ డీఈఈ పేరు చెబుతున్నారన్నారు. ఆయనకు తాము ఫోన్ చేస్తే పనిచేయడం లేదన్నారు. తరలిస్తున్న సామగ్రి కంపెనీకి సంబంధించినదే అని ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు పోలీసులు మాజీ ఎమ్మెల్యేకు సాయం చేసేందుకు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉదయం నుంచి ఎమ్మెల్యే సోదరుడి బావమరిదిని దగ్గరుంచుకుని సామగ్రిని తరలించడంపై తమకు అనుమానాలున్నాయన్నారు. ఈరోజు మిషనరీ తీసుకెళ్తున్నారు. మరో రోజు ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన కడ్డీలు, ఇసుక, సిమెంటు ఇతరత్రవాటిని తీసుకెళ్లిపోతారని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇక్కడ సిమెంట్ పెల్లలను బయటకు తరలించి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు.



యంత్రాలను తరలిస్తున్న దృశ్యం

రైతు బతుకే దేశ ప్రగతి

● జనప్రియ కవి ఏలూరు యంగన్న

అనంతపురం కల్చరల్, జూన్ 9 : రైతు బతుకే దేశ ప్రగతి అని, రైతు లేకపోతే ఏ దేశమైనా ప్రగతిని సాధించలేదని జనప్రియ కవి ఏలూరు యంగన్న పేర్కొన్నారు. కవి మార్తాటి ఈశ్వరీ గోపాలరావు రచించిన 'రైతు మా రాజు" పుస్తకాన్ని ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో ఎస్కేయూ తెలుగు శాఖ విభాగాధిపతి ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఏలూరు యంగన్న చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు మా రాజు కావ్యంలో రచయిత పశు సంపదనే దేశ సంపదగా కీర్తిస్తాడన్నారు. ఎరువుల కల్తీని ఎండగడతాడని పేర్కొన్నారు. ఈశ్వరీ గోపాలరావు కేవలం కవి మాత్రమే కాదని, మంచి సామాజిక నాటకాలను రచించి ప్రజల్లో చైతన్యం కలిగించాడని కొనియాడారు. సీనియర్ సాహితీవేత్త తూముచర్ల రాజారామ్ మాట్లాడుతూ... రైతు మా రాజు' పుస్తకంలో కష్టపడే రైతు జీవితం, మట్టి వాసన, పల్లెటూరి సోయగాలు, రైతును ముడిపెట్టిన జీవితం కనిపిస్తుందన్నారు. ఏ దేశం అయితే రైతును గౌరవిస్తుందో ఆ దేశం అభివృద్ధి చెందుతుందని కవి స్పష్టంగా వ్యక్తపరిచాడన్నారు. అనంతరం ఈశ్వరీ గోపాలరావు దంపతులను ఘనంగా సత్కరించారు. తదనంతరం బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు మరణం పట్ల సాహితీకారులు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర శాస్త్రి, టీవీ రెడ్డి, నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, గోవిందరాజులు, దాసన్నగారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ఈశ్వరీ గోపాలరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

గ్రామాల్లో ఘర్షణల జోలికి వెళ్లొద్దు

పార్టీ శ్రేణులకు పరిటాల సునీత, శ్రీరామ్ పిలుపు

అనంతపురం అర్బన్, జూన్ 9: గ్రామాల్లో ఘర్షణల జోలికి వెళ్లకూడదని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులకు సూచించారు. నగరంలోని వారి స్వగృహంలో ఆదివారం రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్నికల విజయోత్సాహంలో పార్టీ శ్రేణులంతా ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఎవరూ గ్రామాల్లో ఘర్షణల జోలికి వెళ్లకూడదని సూచించారు. ఘోర పరాభవం చెందిన వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు దిగవచ్చునని, అయినా సంయమనంతో ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలన్నదే టీడీపీ సిద్ధాంతం, తమ లక్ష్యం కూడా అన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌ను కలిసిన టీడీపీ నాయకులు

ఇంక చాలు.. ఈ జీవితం..!

జిల్లాలో ఐదుగురి ఆత్మహత్య

పుట్లూరు, జూన్ 9: మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన ఉమ్మడి ముఖేష్‌కుమార్‌రెడ్డి (27) అప్పులబాధతో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముఖేష్‌కుమార్‌రెడ్డి మూడేళ్ల నుంచి అరటికాయల వ్యాపారం చేస్తూ నష్టపోయాడు. అప్పుగా అరటికాయలు ఎత్తించిన రైతులు ఒత్తిడి చేయడంతో భరించలేక ఇంటిలోని బాత్రూం శుభ్రపరిచే యాసిడ్‌ను తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈయనకు భార్యతోపాటు నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. తండ్రి లక్ష్మీనారాయణ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కళ్యాణదుర్గంరూరల్: మండలంలోని మంగళకుంట గ్రామానికి చెందిన కురుబ నాగరాజు (38) ఆదివారం మద్యం మత్తులో తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కురుబ నాగరాజుకు ఆత్మకూరు మండలం యాలేరు గ్రామానికి చెందిన జ్యోతితో వివాహం జరిగింది. ఈయన ఇల్లరికం వెళ్లి యాలేరులో స్థిరపడ్డాడు. ఎన్నికల నేపథ్యంలో ఓటు వేయడానికి మంగళకుంటకు వచ్చి, అప్పటి నుంచి ఇక్కడే ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి కుమారుడు, భార్య ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మండలంలోని ఎగువతండాకు చెందిన చందానాయక్ (35) మద్యం మత్తులో తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. చందానాయక్ మద్యానికి బానిసై తరచుగా భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం భార్య భానుబాయితో గొడవపడ్డాడు. దీంతో ఆమె తన కుమారుడితో పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో ఒక్కడే ఉన్న చందానాయక్ మద్యం మత్తులో ఉరి వేసుకున్నాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో రైతు...

బ్రహ్మసముద్రం: మండలంలోని చెలిమేపల్లి గ్రామంలో గొల్ల గిడ్డప్ప (58) ఆదివారం కుటుంబ కలహాలతో వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆటోలో రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. బ్రహ్మసముద్రం ఎస్ఐ పరశురాముడు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతికి గల కారణాలపై కుటుంబ సభ్యులను ఆరా తీశారు.

యాడికి: మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన మద్దిలేటి (78) అనారోగ్యంతో ఆదివారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మద్దిలేటి కొన్ని సంవత్సరాల నుంచి ఆయాసంతో బాధపడుతుండేవాడు. వయోభారానికి వ్యాధి తోడవడంతో భరించలేక ఆదివారం మధ్యాహ్నం గ్రామసమీపంలోని బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మద్దిలేటి మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీయించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి
యాడ్స్ డిపార్ట్‌మెంట్ : 99854 11165, 99854 11179, 9900167475,
ప్రతి ప్రకటనలపై GST 5% వర్తించబడును.
అనంతపురం : 99854 10956, 99854 01243, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 189255

WANTED TEACHERS
Wanted Qualified Teachers to Teach English Medium in Higher School for the following Subjects Maths, Telugu, Hindi & Sciences, Contact: Little Flower E.M. School, ATP, Cell:9949083624.
AJA-Noor

WANTED TEACHERS
Wanted Teachers classes (1st-7th) subjects - English, Science, & Social Contact: 9704588225, 9704925959.
AJA-Lingamaih

PCMR E.M.SCHOOL
Wanted Wardens (Hostel), Hand Writing Teachers, Physics Teacher for Mid School, Contact: 95052 92219, 9885386684.
AJA-Noor

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

పెన్షనర్ల భవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎన్‌జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

రాయదుర్గం రూరల్, జూన్ 9: రిటైర్డ్ అధికారులు నిర్మించిన భవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సమైక్యాంధ్ర భవనంలో ఏపీఎన్‌జీఓ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగులకు కేటాయించిన స్థలంలో అక్రమంగా ప్రవేశించి వారి బేస్‌మెంట్‌పై నిర్మాణం చేయడం దౌర్జన్యానికి పరాకాష్ట అన్నారు. ఎలాంటి పత్రాలు, అనుమతులు లేకుండా కేవలం గత ప్రభుత్వ ప్రజాప్రతినిధుల అండదండలతో నిర్మించిన వారిపై వెంటనే క్రిమినల్ చర్యలుతీఈసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ మాట్లాడుతూ ప్రశాంతమైన ఈ ప్రాంతంలో అధికారులుగా ఉండి రిటైర్డ్ అయిన వ్యక్తులు దారుణానికి పాల్పడడం తగదని చెప్పారు. వెంటనే ఆ భవనాన్ని సొంతదారులైన నాలుగో తరగతి ఉద్యోగులకు స్వాధీనం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెన్షన్ల సంఘం అధ్యక్షుడు డీ రామాంజనేయులు, ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సంఘం నాయకులు హనుమాన్, పరమేశ్వరప్ప, రామాంజనేయులు, పెన్షన్ సంఘం కార్యదర్శి సత్యనారాయణ, చిదానంద పాల్గొన్నారు.

బంకును కూల్చివేసిన దుండగులు


కూరగాయల బంకును కూల్చివేసిన దృశ్యం

యాడికి, జూన్ 9: మండలంలోని రాయలచెరువు గ్రామంలో జాతీయ రహదారి పక్కన ఉన్న కూరగాయల బంకును శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారు. బంకు యజమాని శ్రీనివాసులు తెలిపిన మేరకు కొన్నేళ్లుగా ఇక్కడే కూరగాయల వ్యాపారం చేస్తున్నట్లు తెలిపాడు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బంకును కూల్చివేసి వెళ్లారన్నారు. గ్రామ పంచాయతీ అధికారుల అనుమతితోనే తాను బంకును ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే కూల్చివేసి వెళ్లారని తెలిపాడు. మరో రెండు చిన్న దుకాణాలను కూడా దుండగులు కూల్చివేసి వెళ్లడం గమనార్హం. కూల్చివేసిన దుకాణాల వద్దకు పోలీసులు వెళ్లి ఆరాతీశారు. దీనిపై బాధితులు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. పంచాయతీ కార్యదర్శి అరుణ్‌ను వివరణ కోరగా దుకాణాల నిర్వహణకు తాము ఎవరికి అనుమతి ఇవ్వలేదని, కూల్చివేసిన బంకులు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్నాయని తెలిపారు. రాజకీయ కోణంలో జరిగిందా కూల్చివేసిన బంకుల యజమానులు వైసీపీ మద్దతుదారులు కావడంతో టీడీపీ వర్గీయులు ఏమైనా బంకులను కూల్చివేశారా అనే కోణంలో పోలీసులు వివరాలు ఆరాతీస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి


తిరుపాల్‌రెడ్డి మృతదేహం

పెద్దపప్పూరు, జూన్ 9: మండలంలోని ముచ్చుకోట సమీప అటవీ ప్రాంతంలో ఆదివారం తిరుపాల్‌రెడ్డి (60) అనే వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. యల్లనూరు మండలం పాతపల్లి గ్రామానికి చెందిన తిరుపాల్‌రెడ్డి కొంతకాలంగా గుండె సమస్యతో బాధపడుతుండేవాడు. పలుమార్లు హార్ట్ స్ట్రోక్ కూడా రావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాడని తెలిపారు. తాడిపత్రిలో ధర్మవరం బస్సుఎక్కిన తిరుపాల్‌రెడ్డి ముచ్చుకోట అటవీప్రాంతం వద్ద దిగి లోపలికి వెళ్లాడు. పొలం పనులకు వెళుతున్న పలువురు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాల ఢీ... ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 9: పట్టణంలోని కంబదూరు బైపా‌స్‌లో ఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనలో గొల్ల బసవరాజు తీవ్ర గాయాలు కాగా మరొక ద్విచక్ర వాహనదారుడు హనుమంతుకు కాలు విరిగింది. ఇద్దరిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


కొళగానహళ్లి గ్రామ శివారులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

బొమ్మనహాళ్, జూన్ 9: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొళగానహళ్లి గ్రామ శివారులోని విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. స్తంభాలు నేలకూలడంతో కొళగానహళ్లి, లింగదహాళ్ తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆ గ్రామాలలో చీకట్లు అలుముకున్నాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు అంటున్నారు.

విత్తనాల కోసం రైతుల పరుగులు

యల్లనూరు, జూన్9: రుతుపవనాల ప్రభావంతో మండలంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాల కోసం పరుగులు తీస్తున్నారు. జూన్‌లో విత్తనం వేయడానికి మంచి అనుకూలం కావడంతో రైతులు సోయాబీన్, మొక్కజొన్న, కొర్ర వంటి పంటలు సాగుచేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ విత్తనాలు మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో లేకపోవడంతో వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. మొక్కజొన్న, కొర్ర వంటి విత్తనాల కోసం తాడిపత్రి, నంద్యాల, పులివెందుల ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. సోయాబీన్ విత్తనాలు క్వింటా మార్కెట్ ధర రూ.5వేలు ఉండగా, విత్తనం కోసం రూ.8వేలు చెల్లించి తీసుకువస్తున్నారు.

సానుకూల దృక్పథమే సమస్యలకు పరిష్కారం

● అసిస్టెంట్ కలెక్టర్ బొల్లినేని వినూత్న

అనంతపురం టౌన్, జూన్ 9: ఏ సమస్య వచ్చినా సానుకూల దృక్పథంతో ముందుకు సాగితే పరిష్కారం దొరుకుతుందని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సూచించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో హీమోఫీలియా బాధితులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసిస్టెంట్ కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులు, కుటుంబసభ్యులు వారు పడుతున్న కష్టాలను ఆమెకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హీమోఫీలియా బాధితుల బాధలు ఆవేదనను కలిగిస్తున్నాయన్నారు. బాధితులకు ప్రభుత్వం తరఫున అందిస్తున్న సేవలు సులభంగా, త్వరితగతిన అందించేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు. కొన్ని కఠినమైన సమస్యలు వస్తుంటాయని వాటికి భయపడడం కన్నా ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగితే ఏదో ఒకరోజు మంచి ఫలితం లభిస్తుందన్నారు. జిల్లా ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ విభాగంలో హీమోఫీలియా బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, ఇంటాస్ ఫౌండేషన్ ప్రతినిధులు వాసుదేవరావు, రామకృష్ణ, శ్యాంసుందర్, కృష్ణమూర్తితోపాటు పలువురు పాల్గొన్నారు.

కూటమి విజయోత్సవాలు

బెళుగుప్ప, జూన్ 9: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో నాయకులు ఆదివారం విజయోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు సౌభాగ్య మండల అధ్యక్షులు వన్నూరుస్వామి, జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు సుధీర్ కేక్ కట్‌చేసి టపాసులు కాల్చారు. బెళుగుప్ప ఎస్సీ కాలనీలో టీడీపీ నాయకులు అంగడి శ్రీరాములు, నారాయణస్వామి, తిప్పేస్వామి, సూర్యనారాయణ, అశోక్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంబరాలు జరుపుకున్నారు. మల్లికార్జున, పెద్ద తిప్పయ్య, ఆవులెన్న సర్పంచ్ రాము, యర్రిస్వామి, శివ, వెంకటస్వామి, త్రివేది నాయుడు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కాలవ శ్రీనివాసులు అత్యధిక మెజార్టీతో గెలవడంతో తెలుగుతమ్ముళ్లు సంబరాలలో మునిగితేలారు. ఆదివారం మండలంలోని మల్కాపురం గ్రామంలో సంబరాలు చేశారు. గ్రామపురవీధులలో డీజేసౌండ్‌లతో యువకుల నృత్యాలు, జై తెలుగుదేశం జైజై తెలుగుదేశం అంటూ నినాదాలు చేస్తూ పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్‌ను కలిసి పూలమాలలు, శాలువలు కప్పి అభినందించారు. రాయదుర్గం నియోజకవర్గంలో రాయదుర్గం మండల ప్రజలు కాలవ శ్రీనివాసులుపై నమ్మకం ఉంచి అత్యధిక మెజార్టీ ఇవ్వడం అభినందించదగ్గ విషయం అన్నారు. బెంగళూరు ఫోరం టీడీపీ కన్వీనర్ బాలచంద్ర, తిమ్మారెడ్డి, రాధాకృష్ణ, బొబ్బిరి కిష్టప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీ.హీరేహాళ్: సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా మండల వ్యాప్తంగా ఆ పార్టీ నాయకుల సంబరాలు కొనసాగిస్తునే ఉన్నాయి. మండల కేంద్రంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో, ఓబుళాపురం గ్రామంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. గ్రామాలలో నాయకులు పాల్గొని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మండల, గ్రామస్థాయి నాయకులకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

కణేకల్లు: తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీ సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని దిగువగేరిలో 132వ బూత్ కన్వీనర్ ఫకృద్దీన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆనంద్‌రాజ్, లాలెప్ప, బీటీ రమేష్, మాబుసాబ్, ఎంసీ సర్మాస్, చాంద్‌బాషా, రహిమాన్, వలి, గోపాల్, తిప్పేస్వామి పాల్గొన్నారు.


బ్రహ్మసముద్రంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నాయకుల సంబరాలు


రాయదుర్గం మండలం మల్కాపురంలో సంబరాలు


బ్రహ్మసముద్రంలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు


కణేకల్లులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీ దాడులను అరికట్టలేని పోలీసులు: టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, జూన్ 9: వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి చిన్న తండాలో టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు దాడులకు పాల్పడినా, వాటిని అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారని మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు విమర్శించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వెంకటాంపల్లి చిన్నతండా గొడవపైన సాయంత్రమే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఏఎస్‌ఐ, కానిస్టేబుళ్లు ఆ గ్రామానికి వెళ్లకుండా మధ్యలోనే వెనుతిరిగి రావాల్సిన అవసరమేమిటన్నారు. ఎవరి ఒత్తిడితో అలా వచ్చారో బహిర్గతం చేయాలన్నారు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల వైసీపీ నాయకులు రాత్రి టీడీపీ నాయకులు సురేష్, రమేష్, లక్ష్మన్న, జ్యోతిబాయి, జ్యోతి, తులసి తదితరులపై దాడిచేసి గాయపరిచారన్నారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో తులసినాయక్ చురుగ్గా వ్యవహరించడం వల్లే దీనిని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలి తప్పా, పోలీసులు చెప్పినట్లు ఫిర్యాదు రాయాలనడం ఏమిటని ప్రశ్నించారు. ఘటనపైన ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాగేంద్ర, మండి ఎర్రిస్వామి, సుధాకర్, బాలు, తులసినాయక్ పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి


రామోజీరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఏపీయూడబ్ల్యూజే సభ్యులు

రాయదుర్గంరూరల్, జూన్ 9: అక్షరశిల్పి రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటు అని ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు కమలాక్షుడు అన్నారు. పట్టణంలోని ఏపీఎన్‌జీఓ భవనంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంతాప సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రామోజీ స్థాపించిన సంస్థలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమందికి ఉపాధిని కల్పిస్తూ నీతి, నిజాయితీ, నిక్కచ్చి వార్తలు రాసేందుకు ఎంతోమంది విలేకరులను తయారుచేసిన మహనీయుడు మరణించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీయూడబ్ల్యూజే కార్యదర్శి గురురాఘవేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు రుద్రముని, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఖాజా, ప్రచార కార్యదర్శి ఆవుల మనోహర్, విలేకరులు రామాంజప్ప, వెంకటేశులు, శోభన్‌బాబు, శివకుమార్ పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఏపీ వర్క్ చార్జిడ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావుకు మృతికి ఆదివారం నివాళులర్పించారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖలందర్ కార్యదర్శి గౌరీనాయుడు మాట్లాడుతూ పత్రికా రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్న గొప్పవ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. సహాయ కార్యదర్శులు బండి ప్రభాకర్, రజనీకాంత్, మురళీమోహన్ పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన వారిని సన్మానిస్తున్న దృశ్యం

రాయదుర్గంరూరల్, జూన్ 9: నాలుగో తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చంద్రమోహన్ తెలిపారు. ఆదివారం స్థానిక సమైక్యాంధ్ర భవన్‌లో నాలుగో తరగతి ఉద్యోగులకు ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా మినుగుల విజయ్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా రఫీక్, సావిత్రమ్మ, లోకేష్, ఉప కార్యదర్శిగా కిష్టప్ప, సరోజమ్మ ఎంపికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

గుంతకల్లుటౌన్, జూన్ 9: టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను ఆయన స్వగృహంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు. ఆయనకు శాలువ వేసి పూలమాలలతో సత్కరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కసాపురం వెంకటేష్, నాయకులు తలారి లక్ష్మీనారాయణ, కొమ్మురవికుమార్, కొమ్మురామాంజి, తలారి రాము పాల్గొన్నారు.

సింగిల్ విండో అధ్యక్షుడి రాజీనామా

గుంతకల్లుటౌన్, జూన్ 9: గుంతకల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు సుంకిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామా పత్రాన్ని గుత్తి సబ్‌డివిజన్ అధికారి వీపీ శ్రీనివాసులుకు పంపామన్నారు.

సహకార బ్యాంక్ చైర్మన్...

కూడేరు, జూన్ 9: వైసీపీ పాలనలో సహకార బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వడ్డే గంగాధర్ టీడీపీ అధికారంలోకి రాగానే రాజీనామా చేశారు. ఆదివారం చైర్మన్‌తో పాటు పలువురు రాజీనామాలు చేశారు.

గుడికట్ల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గురువులు

ఉరవకొండ, జూన్ 9: చాబాల గురువు పరిధిలోని గుడికట్ల గోత్రనామాల క్యాలెండర్‌ను గురువు రేవణ స్వామి, అర్జున్ స్వాములు ఆవిష్కరించారు. కర్ణాటక రాష్ట్రం హంపిలో పూజలు నిర్వహించారు. అనంతరం కుల గురువులు, ఘనాచార్యులు, గొరవయ్యలు, గుడికట్ల పెద్దల సమక్షంలో క్యాలెండర్‌ను విడుదల చేశారు. గోత్రనామాలు, గుడికట్ల వివరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కుల ఐక్యత పరస్పర సహకారానికి, బంధుత్వాల విస్తరణకు తోడ్పడుతుందన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకుడు

కుందుర్పి, జూన్ 9: టీడీపీ అధికారంలోకి వస్తే అరుణాచలేశ్వర స్వామి దేవాలయంలో మొక్కుబడి తీర్చుకుంటున్నానని ఆ పార్టీ నాయకుడు పాలయ్య మొక్కుకున్నాడు. అనుకున్న విధంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అమిలినేని సురేంద్రబాబు అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు, రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా అధికారంలోకి రావడంతో అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నాడు.

14న వేలంపాట

తాడిపత్రి టౌన్, జూన్ 9: మండలంలోని ఆలూరుకోన ఆలయ ఆవరణలో 14వ తేదీన వాహనాల పార్కింగ్‌కు సంబంధించి వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ప్రకటనలో తెలిపారు. 11లోగా దరఖాస్తుతోపాటు రూ.5వేలు డీడీని అందజేయాలన్నారు. ఏడాది పాటు వాహనాల పార్కింగ్‌ను వసూలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆసక్తిగలవారు వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ


గుంతకల్లులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రాయదుర్గంరూరల్, జూన్ 9: కేంద్రంలో మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జింక వసుంధరదేవి అన్నారు. ఆదివారం పట్టణంలోని వినాయక సర్కిల్, పాత బస్టాండ్, లక్ష్మీబజార్ మీదుగా బైక్ ర్యాలీ సాగింది. అనంతరం టపాసులు కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో హీరోజీరావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: భారత ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కేశవ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు హాజరయ్యారు. ర్యాలీ బళ్లారి సర్కిల్‌లోని అభయాంజనేయస్వామి విగ్రహం నుంచి బీరప్ప సర్కిల్, మొయిన్‌రోడ్డు, మార్కెట్‌రోడ్డు మీదుగా కసాపురం రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం వరకు సాగింది. బీజేపీ నాయకులు హరిహరనాథ్, కొలమిశేకన్న, కొలమి రామాంజనేయులు, విశ్వనాథ్, కసాపురం రవి, పురంధర్, మంజులా వెంకటేష్, బండి మురళి, వడ్డె రమేష్, టీడీపీ నాయకులు హనమంతు, వీ రాముడు, జనసేన వాసగిరి మణికంఠ పాల్గొన్నారు.


గుంతకల్లు: ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు: పట్టణంలోని అంకాలమ్మ దేవాలయం వద్ద ఆదివారం భారత ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజలందరూ అభివృద్ధి చెందాలంటే మరోసారి నరేంద్రమోదీ నాయకత్వం కావాలని ప్రజలు కోరకున్నారన్నారు. వెంకటేశ్వర్లు, కొలమి రామాంజనేయులు, విశ్వనాథ్, హరిహరనాథ్, పురంధర్, కొలమిశేకన్న, శ్రీదేవి, పద్మ పాల్గొన్నారు.

బిర్సా ముండాకు భారతరత్న ప్రకటించాలి


బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బ్రహ్మసముద్రం, జూన్ 9: ఆదివాసీల హక్కులు, దేశ అటవీ సంపదను కాపాడాలని కంకణం కట్టుకుని 26 ఏళ్లకే జీవితాన్ని త్యాగం చేసిన బిర్సాముండాకు భారతరత్న ప్రకటించాలని ఉపాధ్యాయుడు రాజన్న కోరారు. మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో ఉపాధ్యాయుడు రాజన్న ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. భారత పార్లమెంట్ హాల్లో బిర్సాముండా చిత్రపటాన్ని పెట్టి భారత ప్రభుత్వం ఘనంగా గౌరవించింది. బిర్సాముండా జీవిత చరిత్ర పాఠ్యపుస్తకాల్లో లేకపోవడం దురదృష్టకరమన్నారు. 13 ఏళ్లకే స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించిన బిర్సాముండా పదహారేళ్లకే తిరుగులేని నాయకుడయ్యారన్నారు. చివరికి బ్రిటీష్ వారు పేదవారికి డబ్బులు ఎరజూపి ఆచూకీ కనుక్కొని జైలులో వేశారన్నారు. 1900 జూన్ 9న బీహార్ జైలులో మరణించారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మిత్రుల జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నీ


క్రికెట్ పోటీలను టాస్ వేసి ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, జూన్ 9: సీనియర్ క్రికెట్ క్రీడాకారులుగా ఉంటూ అకాలమరణం చెందిన ఇర్ఫాన్, రవి, వైటీఎస్ రఘు జ్ఞాపకార్థం తోటి మిత్రులు, క్రీడాకారులు ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, బాయినేని నవీన్, అనిల్ హాజరయ్యారు. పలువురు క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌లను ప్రారంభించారు. పురుషోత్తం, చాంద్‌బాషా, రాజేష్, గోవర్ధన్, సర్మాస్, మోహన్, నాగభూషణం, గోపాల్‌తోపాటు పలువురు క్రీడాకారులు హాజరయ్యారు.

ఓటు వేయలేదని లబ్ధిదారులకు ఇబ్బందులు


రేషన్ బియ్యం కోసం వేచివున్న లబ్ధిదారులు

కుందుర్పి, జూన్ 9: ఓటు వేయలేదన్న నెపంతో రేషన్ బియ్యం పంపిణీలో లబ్ధిదారులకు ఇబ్బందులకు గురి చేసిన సంఘటన మండలంలోని బెస్తరపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. రెండు రోజులుగా రేషన్ బియ్యం కోసం లబ్ధిదారులు వెళ్లి చౌకదుకాణం వద్ద పడిగాపులు కాశారు. ఆదివారం ఉదయం నుంచి వేచి ఉన్నా పంపిణీలో జాప్యం చేస్తూ వైసీపీకి ఓటు వేయలేదనే నెపంతోనే షాప్ నెంబర్ 17వ డీలర్ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

బాధితుడికి ఆర్థికసాయం


బాధితుడికి నగదు అందజేస్తున్న సభ్యులు

తాడిపత్రిటౌన్, జూన్ 9: పట్టణంలోని వివేకానందహైస్కూల్‌లో రాయలచెరువుకు చెందిన అబ్దుల్‌రజాక్‌కు ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ తరఫున రూ.7600 ఆర్థికసాయం అందించినట్లు అధ్యక్షుడు గుర్రప్ప తెలిపారు. పక్షవాతంతో బాధపడుతున్న అబ్దుల్‌రజాక్ కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని తమ దృష్టికి రావడంతో సంస్థ తరఫున ఆర్థికసాయం చేశామన్నారు. కన్వీనర్ శంకర్, కో కన్వీనర్ కరుణాకర్, నాగభూషణం, కుమారస్వామి, విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య పాల్గొన్నారు.

టీచర్ల సంక్షేమమే ఎస్టీయూ లక్ష్యం

అనంతపురం విద్య, జూన్ 9: ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా ఎస్టీయూ ముందుకెళుతోందని ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఎస్టీయూ 78వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు మాట్లాడుతూ నిజాం కాలంలో పురుడుపోసుకున్న ఎస్టీయూ అనేక ఉద్యమాలు చేసిందన్నారు. టీచర్ల న్యాయబద్ధమైన సమస్యలపై అనేక పోరాటాలు చేసిందన్నారు. యూనియన్ వ్యవస్థాపకులు వీణ విజయరామరాజు, మగ్దూం మొహిద్దీన్ సేవలు మరువలేనివన్నారు. ఆ సంఘం రాష్ట్ర నాయకులు సూర్యుడు, చంద్రశేఖర్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం టీచర్లను బోధనకే పరిమితం చేయాలన్నారు. అదేవిధంగా జీవోలు 117, 128 రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రాజశేఖర్, కిషోర్ కుమార్, రామకృష్ణ, నాగేంద్ర పాల్గొన్నారు.